# ధర్మం నిలిచింది

పూర్తిగా తూరుపు తెల్లవారకముందే ఊరంతా పాకిపోయింది "పిచ్చిది చచ్చిపోయింది" అన్న వార్త. రాత్రి ఊరు మాటు మణిగే వరకు వెర్రి మొర్రి కేకలతో, పిచ్చి పిచ్చి పాటలతో వీధులన్నీ కలయ తిరిగిన పిచ్చిది. ఊచల్లాటి కాళ్ళతో, బాన వంటి పొట్టతో, ఒంటినిండా గుడ్డలైనా లేకుండా, సంఘంలో కుళ్లుకి, పురుషుల పశుప్రవృత్తికి నిదర్శనంగా నిండు చూలాలైన పిచ్చిది తెల్లవారేసరికి శవంగా మారిపోయింది.

వార్త విన్నదే తడవుగ చిన్న పెద్ద అన్న తేడా లేకుండా అంతా పరుగు తీసారు, ఆ వార్త తెచ్చిన పోలిగాడివెంట. ఊరు చివర చెట్టు కింద చచ్చిపడి ఉంది పిచ్చిది అర్ధనగ్నంగా. ఆమె కాళ్ళ ముందు అప్పుడే పుట్టిన పసికందు తనీలోకంలోకి వచ్చిన కారణం ఏమిటో? కర్త లెవరో? తెలుసుకోలేని రక్తపు ముద్ద, తల్లి కడుపులోంచి తోడు తెచ్చుకొన్న వెచ్చని పచ్చి నెత్తురు మడుగులో పడి తప తప కొట్టుకొంటోంది.

పిచ్చిదాని బుద్ధి మొద్దుబారింది కాని వయసు గడ్డకట్టలేదు. బ్రతికున్న ప్పుడు మతిలేని మాటల్లో, పసలేని చేతల్లో దాగిపోయిన దాని వయసు చూపే అందాలు, అన్ని బాధలకీ అవమానాలకీ అతీతంగా చచ్చిపడి ఉన్న దాని శరీరంలో పాలపొంగులా పొంగి పొరలాడుతున్నాయి. కళ్ళ నిండా జాలి నింపుకొని, మనసు నిండా మరేదో ఉంచుకొని రెప్ప వెయ్యకుండా అటే చూస్తున్నారు పెద్దలు. పెద్దలన్న బురఖా తగుల్చుకొన్న ప్రబుద్ధులు.

అందరితోపాటు తనూ అక్కడికి వచ్చింది అసిరి. పిచ్చిదాని మరణవార్తను జనావళికి అందజేసిన పోలిగాడి పెళ్లాం. పిచ్చిదాన్ని ఆ స్థితిలో అందరికన్న ముందు చూసింది తనే కాబట్టి అగ్రాసనాధిపత్యం తనదే అన్నట్లు శవానికి బారెడు దూరంలో ఒళ్లంతా కళ్లు చేసుకొని చూస్తూ నిలబడ్డాడు పోలిగాడు.

"కూంత దారియ్యండి బాబులు! కాసింత తప్పుకోండి సాములు" అంటూ మంది మధ్య నుంచి దారి చేసుకొని ముందుకు వచ్చింది అసిరి. ఎదురుగా పిచ్చిది, సిగ్గు ఎగ్గులన్నిటికీ అతీతంగా ఆలోకం చేరుకొన్న ఆడది. కాని, చుట్టూ ఉన్న జనం. ఉప్పు, కారం తింటూ, పెళ్లాం పిల్లలతో సంసారాలు చేసుకొంటూ ఊరికి పెద్దలమని బోర విరుచుకు తిరిగే బాబులు, కాషాయ గుడ్డలు కట్టుకొని, కపాలం చేతబట్టుకొని భిక్ష అడుక్కొంటూ 'నువ్వు మిధ్య, నేను మిధ్య, జగత్తులో అంతా మిధ్య, ఉండేది ఆ పరమ శక్తిమంతుడు పరమేశ్వరుడు ఒక్కడే అంటూ తత్వోపదేశాలు చేసే స్వాములు. రోజూ తెల్లవారేసరికి తట్టెడు విభూతి, పట్టెడేసి రుద్రాక్షమాలలు ధరించి అష్టాదశ పురాణాల సారం అర గడియలో చెప్పగలిగే పండిత ప్రముఖులు.

చుట్టూ వున్న అందరినీ ఒక్కసారి కలియ చూసింది. ఒక్క ఉదుటున పోలిగాడి తలగుడ్డ లాగి పిచ్చిదాని శవం మీద కప్పింది.

అసిరి చేసిన పనితో అక్కడ వున్న జనం అంతా ఒక్కసారి తుళ్లిపడ్డారు. అనుకోని పరిస్థితిలో చేతిలోని తిండిని గెద్ద తన్నుకు పోయినట్లు ఆశ్చర్యపడ్డారు.

"ఎవరునువ్వు?" ఎన్నో కంఠాలు కరకుగా ప్రశ్నించాయి.

'సాటి ఆడది' అసిరి చెప్పలేదు ఆ జవాబు. అంతసేపుగా ఆ చుట్టుపక్కలే ఉస్సురని నిట్టూరుస్తూ తిరుగుతున్న గాలి చెప్పింది.

"పోలిగాడి పెళ్లాం" ఎవరో చెప్పారు.

ఎంత ధైర్యం?

ఎంత సాహసం?

ఇంతమంది పెద్దలం మనముండగా ఒక మాదిగ ముండ, తగుదునమ్మా అని వచ్చి శవం మీద బట్ట కప్పుతుందా?

పెద్దల బుర్రలు వేడెక్కాయి... పెళ్లుమంటూ ఎండ వచ్చింది. ఆవేడి ఈవేడి కలసి కళ్లలో వెలిగింది. ఆ సెగల తాకిడికి మల మల మాడిపోయాడు పోలిగాడు.

"ఎవరు కప్పమన్నారు నిన్ను? తీసేయ్ ఆ మైలగుడ్డ."

"ఏరూ కప్పమనలేదు సామీ! సచ్చినా బతికినా పిచ్చిది ఆడదాయె. నానూ ఆడ పుటుకే పుట్టాను. సూత్తూ.... సూత్తూ.... ఫీరంతా మొగోళ్లు... మీకేంటి సెప్పను బాబూ!"

అన్ని బుర్రలు ఒక్కసారి కిందికి వంగాయి. ఆ మాలకూతురికి ఉన్న జ్ఞానం తమకి లేకపోయింది అన్న సిగ్గుతో కాదు, తప్పు చేస్తూ పట్టుబడి పోయామే అన్న చిన్నతనం వల్ల.

బ్రతికుండగా పిచ్చిదాని గురించి పిసరంత పట్టించుకోని మనుషులు "అయ్యో పాపం" అంటూ వచ్చి తమ సానుభూతి కురిపించారు. ఆకలి కడుపుతో అది వీధుల వెంటపడి తిరుగుతుంటే పట్టెడు అన్నం పెట్టని దాతలు దాని శవదహనానికి స్వయంగా ముందుకొచ్చి డబ్బులిచ్చారు.

శవపరీక్షలు, పంచాయితీలు జరిగిపోయాయి.

జనన, మరణ రిజిష్టరులో పిచ్చిదాని చావు ఎక్కిపోయింది.

"ఆ బిడ్డని నా కిప్పించండి సాములు. బిడ్డలు లేనిదాన్ని. పేణం పెట్టి పెంచుకొంటాను" దోసిలిపట్టి అర్థించింది అసిరి, పంచాయితీ పెద్దల ముందు.

ఒకరి ముఖం ఒకరు చూసుకొన్నారు పెద్దలు, ఒక సమస్య తీరిపోయింది అన్న భావం పారాడింది ఆ చూపుల్లో. అంతలో అడ్డుతగిలాడొక సైంధవుడు, వర్ణాశ్రమ ధర్మ రక్షణకై కంకణం కట్టుకొన్న ఒక ప్రబుద్ధుడు పిచ్చిదాని కుల మేమిటో మతమేమిటో తెలియకుండా బిడ్డని దానికెలా ఇస్తాం? అంటూ.

బ్రతికుండగా పిచ్చిదాని కులమతాలేమిటో పట్టించుకోని గ్రామస్థులకు అది చచ్చాక దాని ముఖం మీద అవి కాస్తా రాసున్నాయేమో అన్నట్లు పట్టి పట్టి చూసారు.

వారి పరీక్షలు వ్యర్థం కాలేదు. మందిలో ఒకరికి దొరికింది పిచ్చిదాని ఆచూకీ. "ఇది భైరవశాస్త్రి కూతురు సీతాలు" ఈ నిర్ణయానికి ఇక తిరుగు లేదు అన్నట్లు అన్నాడు ఆ ఒకడు.

"ఆ కంటి కింద పుట్టుమచ్చ, బుగ్గ మీద ఉలిపిరికాయ, ఇంకేం సందేహం లేదు. ఇది సీతాలే. పెళ్లి ముహూర్తం పెట్టిననాడే చెప్పాను. దీని మెడలో తాళి కట్టిన అభాగ్యుడు ఆరు నెలలు తిరక్కుండా ప కీమంటాడని" ఆ ఒక్కడికి వత్తాసు పలికాడు మరి ఒకడు.

"అదిగదిగో.... నుదుటి మీద కాలిన ఆ మచ్చుంది చూసారా? సీతాలుకి చిన్నతనంలో ఒకసారి 'బాలపాప చిన్నెలు' కనిపిస్తే... ఇదిగిదిగో ఇలాగే చుట్ట కాల్చుకొంటూ వీధిని పోతున్న నన్ను చూసి దీనితల్లి అన్నపూర్ణమ్మ అమాంతం వచ్చి కాళ్ళ మీద పడింది. వెంటనే ఇంట్లోకి వెళ్లి ఒక్క చురక అంటిచానో లేదో కుర్రది ఇట్టే తేరుకొని కిలకిల నవ్వేసింది" వైద్య శిఖామణి విశ్వనాధులవారి వివరణ.

"ఆ ఎడం పాదం మధ్యలో సుడి ఉంది చూసారూ! అందునా కుడికాలు బొటన వేలు కొంచెం పెద్దగా ఉండి ముందుకు వాలి ఉన్నప్పుడు 'ఒరేయ్ భైరవయ్యా! నీ కూతురు మహారాణి అయిపోతుందిరా, తప్పిందా పిచ్చిది అవడం ఖాయం' అని ఇది పుట్టిననాడే వాడితో చెప్పాను" సాముద్రిక వేత్త తిరుగులేని నిర్ణయం.

ఇంతమంది పెద్దలు చచ్చిపడి ఉన్న పిచ్చిది భైరవశాస్త్రి కూతురు సీతాలు అని ఘంటాపథంగా చెప్తుంటే ఇంక కాదనడానికి దమ్ములెవరికుంటాయి? "సీతాలు అంటే సీతాలే" అని ఒక పాతిక గొంతులు వంతపాడాయి.

ఆ పిచ్చిది తమ బిడ్డ అవునో, కాదో చెప్పడానికి సీతాలు తల్లిదండ్రులు ఆ మూకలో లేరు. అసలు ఈ లోకంలోనే లేరు. కంట నీరు పెట్టుకొంటూ ముసలి మొగుడి వెంట అత్తింటికి వెళ్తున్న కూతుర్ని అంపకం పెట్టడానికి ఊరు చివర వరకు వెళ్లిన తల్లి తిరిగి ఇల్లు చేరలేదు.... అటు కూతులరుతో వెళ్లనూ లేదు. మూడు రోజులనాడు నూతిలోంచి తీసిన అన్నపూర్ణమ్మ శవం మాత్రం ఇంటికి చేరింది. కట్టుకొన్న పెళ్లాం మాటని, కన్నకూతురు మనసుని కాలరాచి డబ్బుకు అమ్ముడుపోయిన భైరవశాస్త్రిని నెల తిరగకుండా, ఆ డబ్బు కోసమే అర్థరాత్రి ఇంటపడ్డ దొంగలు నరికి పోగులు పెట్టారు. ఆనాటి శాస్త్రి కుటుంబానికి చిహ్నంగా ఆ ఊళ్లో మిగిలింది 'దయ్యాలకొంప' అనే పేరుతో పిలవబడే ఒక పాడుపడిన ఇల్లూ, అయితే గియితే పెద్దవారి మూర్ఖత్వాలకీ దేవుడు చేసిన అన్యాయానికీ, కుళ్లు మనుషుల కుతంత్రాలకీ బలియై పిచ్చిదిగా మిగిలిపోయిన ఈ సీతాలు.

"దీనిలో ఇంకేం సందేహం లేదండీ. మూడేళ్ల నాడు ఇది ఈ ఊరు రావడంతోనే ముందుగా ఆ ఇంటికే వెళ్లిందట. అప్పుడు ఇంతగా పిచ్చి ముదిరిపోలేదు. చూడండి....

ఇరుగు పొరుగు వారిని ఏమేమో అడిగిందట. ఆ వెనుక కూడా ఆ పాడుపడిన ఇంట్లో ఒక గది బాగు చేసుకొని..." ఉత్సాహవంతులైన గ్రామస్తులు ఇంకా వివరాలు అందిస్తూనే ఉన్నారు.

"పెళ్లి చేసుకొన్న నాలుగు నెలలకే ఆ ముసిలి మొగుడు కునికేయడం, దాయాదులు ఆస్తంతా చేజిక్కించుకొని దీన్ని ఇంటి నుండి తరిమి వేయడం... ఇదంతా మనకి తెలిసిన కథే కదండీ? పాపం ఆ వెనుక ఇంతకాలం ఎక్కడ తిరిగిందో... ఎలా బ్రతికిందో... చివరికి ఈ మట్టిలో కలిసిపోడానికి ఈ ఊరు వచ్చింది."

మాటలు నల్ల డబ్బులా చురుకుగా ప్రయాణిస్తున్నాయి. ఎండ పెళ్లికాని పడుచు మనసులో కోరికల్లా రెచ్చిపోతోంది. చెట్టు కింద కుర్రది గుక్కపట్టి ఏడుస్తోంది. ఏడ్చి ఏడ్చి అలసిపోతోంది. అలసి సొలసి అంతలో ఊరుకొంటోంది. ఆకలికి తట్టుకోలేక మళ్లీ ఏడుస్తోంది. తన కోసం అంత మంది పెద్దలు, పాచిముఖాలైనా కడక్కుండా, నెత్తిని మాడుస్తున్న ఎండనైనా లెక్క చెయ్యకుండా, ధర్మాన్ని పరిరక్షించడానికి పాటుపడుతున్నారని అణువంతైనా జ్ఞానం లేని ఆ చిన్నది, అతి చిన్న విషయం అయిన తిండి కోసం అలమటించిపోతోంది. తన రోదనతో పరిసరాల్ని హోరెత్తిస్తోంది.

ఈ పెద్దల ధర్మ నిర్ణయం జరిగేవరకూ ఈ పసిది బ్రతికుంటుందా? జాలి గుండె గల మనుషులు కలత పడ్డారు. అలా ఏడ్చి ఏడ్చి నోరెండి ఊరుకొంటుందేమో? అసిరి మనసులో బిడ్డ మీద మమత సుళ్లు తిరిగింది.

"ఏదో ఓటి సెయ్యండి బాబూ! ఎక్కడో ఓకాడ ఆ కుర్రదాన్ని బతకనీండి" ఆత్రంగా అందరినీ బ్రతిమాలుకొంది అసిరి.

ఏం చెయ్యడం? ఏం చెయ్యడం?

మళ్లీ మొదటికొచ్చింది కథ.

"అది అడుగుతోంది కదా దానికిచ్చేయండి" మందిలోంచి వేరుపడ్డ మనిషి అన్నమాట అది.

"సీతాలు పిచ్చిది అయినా పుట్టింది బ్రాహ్మణ పుట్టుక. చూస్తూ చూస్తూ దాని పిల్లని మాలదాని చేతిలో ఎలా పెడ్తాం?"

"పోనీ మీలో ఎవరైనా పెంచుకోండి."

"అయ్యా! ఆచార్లుగారూ! మీ ఆవిడ ఆడపిల్ల అని తెగ పలవరించిపోతోందిగదా. కుందనపు బొమ్మలా ఉంది కుర్రది. తీసుకెళ్లి పెంచుకోరాదూ?"

"సరి సరి.... ఉన్నవాళ్లకే తిండి పెట్టలేక నే ఛస్తూంటే ఇంకా ఇదొకటా?"

"బాబూ లింగరాజుగారూ! పిల్లలు లేరని ఉన్న పెళ్లానికి విడాకులు ఇచ్చి, ఇంకోదాన్ని కట్టుకోకపోతే రత్నంలాంటి పిల్ల... దేవుడీ రూపాన ఇచ్చాడనుకొని..."

"శివశివ.... శివశివ... ఈరోజు ఉదయాన్నే లేస్తూ ఎంత పాడు మాట విన్నాను పరమేశ్వరా! విధవముండకి పుట్టిన పిల్లని... తండ్రెవరో తెలియని దాన్ని..."

అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తినానివ్వదు అన్న విధంగా సాగి పోతున్నాయి సంభాషణలు, ఎంతకీ తెగని వాదనలు.

సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చేసరికి పెద్దల ధర్మ నిర్ణయం జరిగిపోయింది. కుర్రదాని ఏడుపు ఆగిపోయింది. అంతవరకు మూసి ఉన్న కళ్లు కొద్దిగా విచ్చుకొన్నాయి. కొద్దిగా విచ్చుకొన్న ఆ కళ్లు పరిసరాల్ని వింతగా చూస్తున్నాయి.

పెద్దల అనుజ్ఞ అందుకొని, అసిరి ముందుకు అడుగు వేసింది ఉత్సాహంగా. అమ్మని కోల్పోయిన చిన్నది, నాన్నెవరో ఎరుగని కుర్రది, అంతసేపు ఆక్రోశించి అసిరి చేతుల్లోకి వచ్చింది చల్లగా... మంచుగడ్డలా.

అసిరి చేతిలో పసిది అతి దీనంగా చూస్తోంది.

రెప్పపడని ఆ కళ్లు విచ్చుకొనే ఉన్నాయి.

పంచభూతాల్ని, ధర్మనిర్ణేతల్ని తరచి తరచి ప్రశ్నిస్తున్నాయి.

చెట్టుల్లారా! పుట్టల్లారా! చుట్టూ ఉన్న పెద్దల్లారా!

మీలో ఎవరైనా చెప్పగలరా నా జనన మరణ రహస్యాన్ని?

నాకీ బ్రతుకిచ్చింది ఎవరు? నా చావుకి కారకులెవరు?

"మేం కాదు... మేం కాదు" రెక్కలల్లాడిస్తూ పక్షులు ఎగిరిపోయాయి.

"మాకేం తెలియదు... మాకేం తెలియదు" చెట్లు విచారంగా తల లాడించాయి.

ఎదురుగా ఉన్న పెద్దల వైపు కన్నెర చేసి చూసాడు సూర్యుడు. తప్పును ఒప్పుకోలేని పెద్దలు. నిజానికి నిలకడలేని పిరికిపందలు సన్నసన్నగా జారు కొన్నారు. ఇంకా అక్కడే నిలిచి ఉంటే ఆ పసిదాని ప్రశ్నకి జవాబు చెప్పవలసిన బాధ్యత తమపై ఎక్కడ పడ్తుందో అని "అబ్బ.... ఏం ఎండ? ఏం ఎండ?" అంటూ పై గుడ్డలు దులుపుకొని తలకి చుట్టుకొంటూ పలాయనం చిత్తగించారు ధర్మనిర్ణేతలు.

అసిరి చేతిలో పసిది బిగుసుకుపోయింది.

చెట్టుకింద పిచ్చిదాని శవం చలనరహితంగా పడి ఉంది.